
# మనోధర్మ

## -జలంధర



"ఏల్ యూనివర్సిటీ మెడికల్ స్కూలుకు చెందిన కీ గార్డన్‌లో మ్యూజిక్ రిసనెన్స్ ద్వారా ఎనస్థీషియా లేకుండా ఆపరేషన్ చెయ్యాలని ప్రయత్నం చేశాడు... ఆపకుండా సంగీత ప్రసారం ఒకే స్థాయిలో చేసినప్పుడు పేషెంటు ట్రాన్స్‌లోకి వెళ్ళి నాడి వేగం తగ్గి నెప్పి తెలియదు. స్విస్ సైంటిస్ట్ హాన్స్ జన్నీ "సైన్స్ ఆఫ్ సిమాటిక్స్" వృద్ధి చేశారు. రకరకాల శృతి భేధంతో , లయ భేదంతో, ఇసుక, ఇనుప రజను – వీటిలో జీవశక్తిని స్పందనను కల్పించగలం  అని ఋజువు చేశారు ... ఆ పద్ధతి మీద ఇదుగో ఈ ఇన్‌స్ట్రుమెంట్ కనిపెట్టారు..."

చెపుతూ ఆపి ఆ వాయిద్యాన్ని చూపిస్తున్నాడు దక్షణామూర్తి.

అది ఒక సంగీత వైద్యకళాశాల. అక్కడ వైద్యాన్ని కళగా, కళతో వైద్యాన్ని సాధించే ప్రయత్నం చేస్తారు.

సంగీతంతో చాలా బాధలు,ముఖ్యంగా సైకోసామాటిక్ రోగాలు తగ్గించవచ్చు అన్న పద్ధతి మీద అక్కడ రిసర్చ్, వైద్యం రెండూ జరుగుతున్నాయి.

తనలో తపస్సులాంటి శక్తిని, సంగీత జ్ఞానాన్ని ధారపోసి ఆ "కళాశాల" స్థాపించాడు దక్షణామూర్తి. దాని పేరు "మనోధర్మ"

ఓపిగ్గా అక్కడి రిసర్చ్ గురించి చెపుతున్నాడు అతను. అచ్చెరువుతో చూస్తున్నాడు అతని వెనకాల నడుస్తున్న ఆ బుంగ మీసాలు, ట్వీడు సూటుతో వున్న పెద్ద మనిషి. దక్షణామూర్తి వెనకాల అదుగులు వేస్తూ వస్తున్నారు దాదాపు పది మంది విద్యార్థులు.

ఇంగ్లీషు ఆస్టియోపత్ "పీటర్ సీసీమానర్స్" జన్నీ చేసిన విధానం ఆధారంగా శరీరంలో ప్రతి అవయవం ఒక ముఖ్యమైన లయ, ఫ్రీక్వెన్సీకి స్పందిస్తుంది.. రెస్పాండు అవుతుంది అన్నారు. అలా తయారుచేసిన సంగీత ప్రసారంలో ప్రాణాక్షరానికి, స్వరానికి అవయవాల్లోని జీవకణాలు స్పందిస్తాయి. ఇదుగో ఆ విషయం మీద రిసర్చ్ చేస్తున్నారు నా ఇద్దరు స్టూడెంట్సు..." చెపుతూ ఆపాడు దక్షణామూర్తి.

తెల్లబోయి వింటున్నాడు ఆ పెద్ద మనిషి.

ఆయన ఎక్స్‌ప్రెషన్ చూస్తూ ఫక్కున నవ్వాలని వుంది రాజీవికి. ఏదో పిచ్చాసుపత్రిలోనో, ఫైవ్‌స్టార్ హోటల్‌ల్లాంటి హాస్పిటల్‌లోనో ఆయన మేనగోడల్ని చేర్చి బాధ్యత వదిలించుకోవాలని వచ్చిన పెద్దమనిషి ఆయన. ఎవరో చెప్పారని ఈ విధానం ఏదో కొత్తగా వున్నదని ఇక్కడికి వచ్చాడు పాపం.

మాష్టారుకు బలైపోయాడా? అయినా మాష్టారుకు పిచ్చిగానీ, అందరికీ అన్నీ అర్థమౌతాయా? ... ఇలా ఆలోచిస్తోంది రాజీవి.

వేదంలో ఒక పనసను ... ఒక విశేష రాగంతో మలిచిన దుర్గాస్తుతిని, స్థాయీ భేదాలతో ఏదో మెషిన్ సహాయంతో ప్రసారం చేస్తూ నోట్సు తీసుకుంటున్నాడు ఒక విద్యార్థి.

"ఇదేమిటండీ ... ఇవన్నీ కూడా..." ఇలాంటి భక్తి సంగీతాలన్నీ తప్పని సరిగా గుడి మైకుల్లోనూ, భక్తిగల ఆడంగులు వున్న ఇంట్లోనూ వినిపించాలి కానీ ... ఇది కళాశాలా, పిచ్చాసుపత్రా అర్థం కావడం లేదు అన్న లెవల్లో అడిగాడు ఆ బుంగ మీసాల పెద్ద మనిషి.

నవ్వాడు దక్షిణామూర్తి. అతనికి ఈ ప్రశ్నలు, ఈ తరహా మనుష్యులు కొత్త కాదు.

"అవునండీ ... ఈ భక్తి పేరుతో చెలామణీ అయిపోతున్న స్తోత్రాలన్నీ చాలా వరకు శారీరక, మానసికమైన హార్మనీ కోసరం ఒక శృతిలో లయలో ఏర్పడ్డవి. దేవీ సప్తశతి, విష్ణు సహస్రనామం, శ్రీ సూక్తం, పురుష సూక్తం – ఇవన్నీ వేవ్‌లెంత్, ఫ్రీక్వెన్సీ – థియరీలతో ప్రయత్నిస్తే ఇవి గొప్ప వైద్య ప్రక్రియలు"


ఒక చోట ఇనప అట్లకాడలాంటి వస్తువుతో ఒక నిబద్ధమైన ఉచ్ఛారణ వున్న ఫ్రీక్వెన్సీలో వుంచి మాగ్నటిక్ ఫీల్డ్ రీడింగ్ తయారుచేస్తున్నాడు ఒక స్టూడెంటు.

"ఏమండీ ... ఇవన్నీ మన దేశంలో మాత్రమేనా... మరింకెక్కడైనా..." మెల్లగా అడిగాడు ఆ పెద్ద మనిషి.

కర్ఫ్యూనుంచి పెర్ఫ్యూందాకా విదేశీ ముద్ర కావలసిన సంస్కృతి అతనిది.

హాయిగా నవ్వాడు దక్షిణామూర్తి.

అతని వంక మురిపెంగా చూసుకుంటోంది రాజీవి. మాష్టారు నచ్చి, కాలేజీలో చేరి, ఆ తరువాత మాష్టారి ఆరాధనను తలకిందులుగా పడిపోయినవాళ్ళల్లో అతి ముఖ్యురాలు రాజీవి.



"అమెరికాలో ఎముకలను డిక్లాసిఫై చెయ్యడానికి మస్క్యులర్, ఆట్రోఫీ చెయ్యడానికి ఇప్పుడు సంగీతం ఉపయోగిస్తోంది..." చెపుతూ ఆపాడు దక్షిణామూర్తి. అతను మాట్లాడుతున్నాడు కానీ, అతని దృష్టంతా చేతులు కట్టుకుని నిశ్శబ్దంగా గోడకానుకుని నిలబడ్డ రాధిక మీదే వుంది.

బాబ్ హెయిర్, హాఫ్ స్కర్ట్, చాలా అశ్రద్ధగా కనబడుతున్న నలిగిపోయిన షర్ట్... ఎక్కడో శూన్యంలోకి చూస్తున్న కళ్ళు

చూసీ చూడనట్లు చూసి మళ్ళీ స్టూడెంట్స్‌తో మాట్లాడుతున్నాడు దక్షిణామూర్తి.

"ఈ లెక్కన సౌండ్ పొల్యూషన్, అపస్వరాలు – ఇవన్నీ చాలా రోగాలకు కారణాలౌతాయన్నది నిజమేనన్నమాట..." అడిగాడు ఆ పెద్దమనిషి.

"అవును... సంగీతంలో అపస్వరం, అపక్వత, నరాల టెన్షన్, సైకోసిస్, క్రైవోఫీలియా, నరాల బలహీనత, కండరాల బలహీనత – ఇవన్నీ తెస్తాయి... మరొక తమాషా చెప్పనా? 16వ శతాబ్దంలోనే శృతి, స్పర్శ, రాగ భావన లేకుండా ఒక కాన్సర్ట్‌లో హాల్లో తలుపులు మూసి చేసిన సంగీత ప్రసారం వల్ల ప్రేక్షకుల్లో ముప్పాతిక మంది నరాల వత్తిడికి తట్టుకోలేక మూర్ఛపోయారు. చాలా మంది పారిపోదామని ప్రయత్నించారట ... అప్పట్లో దానికి పేరు లేదు కానీ, సైకోసొమాటిక్ డిసీస్ వాళ్ళందర్నీ ఆవరించింది. లయ, స్వరధ్వని – దీనిమీద ఆధారపడే పైడ్ పైపర్ కథ వచ్చింది"

"సర్ ... మీరో గొప్పపని చేస్తున్నారు. మాబోటి వాళ్ళకు అర్థం కాదు. పిల్లను వదిలి వెళతాను.నాకు మీటింగ్‌కు టైం అవుతోంది..." రెండు చేతులు కట్టుకుని ఆయన వంక చూశాడు దక్షిణామూర్తి. ఆయన రాధిక గురించి చెప్పినది ఏదైనా, మిగతా తను అర్థం చేసుకోగలడు.

ఆయన రాధిక మేనమామ. డబ్బు, షేర్లు, బిజినెస్ అదిచ్చే స్టేటస్ ... వీటి ఉనికి తప్ప, మిగతా సర్వస్వం అబద్ధం అనే ప్రపంచంలోని మనిషి అతను. జీవితపు విలువలు, అబద్ధాలు, నిజాలు, దుఃఖాలు – వీటకన్నింటికీ కూడా ఖరీదు వున్నది వాళ్ళకు. అవసరానికి, అవకాశానికి ఉపయోగించని ఏదీ వాళ్ళకు అక్కర్లేదు.

ఆ విషయం అంటే మాత్రం ఒప్పుకోలేరు. అంతే...

కాన్వెంటులో చదువుకుంటూ ఏ విషయంలోనూ పట్టుదల, ఆలోచించడం అక్కర్లేకుండానే బ్రతికింది రాధిక. అన్నల ఎఫైర్స్, అక్కయ్య బాయ్ ఫ్రెండ్స్ కొత్తకాదు ఆ ఇంట్లో. తల్లి క్లబ్బు మీటింగులు, తండ్రి సెక్రటరీతో బిజినెస్ టూర్లు మామూలు. స్నేహం చేస్తున్న వాళ్ళు ఖరీదైన మనుష్యులు అయితే చాలు ... విలువలు వున్న వ్యక్తులు అక్కర్లేదు ఆ వాతావరణానికి.

అల్లాంటి ఒక అతనితో రాధిక అక్కకు పెళ్ళి జరిగింది. పెళ్ళి ఎంత గొప్పగా జరిగిందో చెప్పకున్నారు కానీ పెళ్ళి ఎంత గొప్పదో ఎవరికీ అక్కర్లేదు.

ఖిల్లరికం వచ్చిన అతను తాగి రాధికపై సెక్స్ నిర్బంధం చేయడం ప్రారంభించాడు.

అరిచి, గోలచేసి అల్లరి పెట్టింది రాధిక. కానీ ఆశ్చర్యం ఎవరూ అదొక తప్పగా, పాపంగా కాక మాటర్ ఆఫ్ ఇన్‌కన్వీనియన్స్‌గా ప్రవర్తించడం ప్రారంభించారు ఇంట్లో ... అసహ్యం వేసింది ఆమెకు.

అక్కయ్య కాపురం ... అల్లుడి ఆస్తి, గొప్ప ఉద్యోగం – ఇవన్నీ చెప్పి సొంత తల్లి నోరు నొక్కింది. సాంఘిక అవినీతి అర్థమై, కచ్చగా మారింది రాధికలో. అన్ని రూల్సూ అతిక్రమిం చాలనుకున్నది. విశృంఖలత గొప్ప అనుకున్నది. కానీ, ఆమెకు ఇష్టం వచ్చినవ్యక్తి, ఆమెను వదిలి వెళ్ళిపోయినప్పుడు అవాక్కయి పోయింది.


" 'డబ్బు' అన్న రెండు అక్షరాలు నీ వెనక నుంచి తీసేస్తే, నీ బ్రతుకేమిటి? నువ్వుగా నీ విలువ ఏమిటి?" అని ప్రశ్నించి అతను వెళ్ళిపోయిననాడు షాక్ తిన్నది.

ఇంట్లో అందరూ అతణ్ణి వెధవ కింద, బ్రత కడం చాతకాని మనిషి కింద మాట్లాడుతూంటే అసహ్యం వేసింది ఆమెకు... అవకాశాలు ఉపయో గించుకుంటున్న అక్క భర్తకు అందలాలు, నిజం ప్రశ్నించిన తన స్నేహితుణ్ణి హత్య చేయించాలన్న ప్రయత్నాలు భరించలేకపోయింది.

నిస్సహాయతలో నుంచి గద్దరితనం, అందులో నుంచి హిస్టీరియా, ఇంట్లో వాళ్ళ ఆపరేషన్ నుంచి డిప్రెషన్‌లోకి జారి పోయింది.

రోగిష్టిదానిలా వున్న పిల్లకు పెళ్ళి చెయ్యడం కష్టం కాబట్టి హాస్పిటల్స్, మందులు, ఎలక్ట్రిక్ షాకులు – ఇలా చాలా చాలా ప్రయత్నాలు చేశారు. ఒక్క ప్రేమ తప్ప, డబ్బు చాలా ఇవ్వగలదు కాబట్టి అన్ని రకాల ప్రయత్నాలు జరిగాయి.

ఇంకా ఇంకా చీకట్లోకి జారి పోయింది రాధిక. కాస్త మానవత్వం వున్న మేనమామకు ఒకటి మాత్రం అర్థమైంది. ఈ పిల్లను ఆ ఇంటి వాతా




"ప్రమాదం"

"ఎక్కువగా నిద్రపోవడం వలన నష్టమేమిటమ్మా మృదులా" అడిగింది టీచర్.

"మనం దిగే స్టేషన్ కాకుండా పక్క స్టేషన్‌లో దిగే ప్రమాదముంది టీచర్" చెప్పింది మృదుల.

–పి.సీతారామయ్య

వరణం నుంచి దూరంగా పంపించి వెయ్యాలని...

ఆయన దక్షణామూర్తి స్థాపించిన "మనోధర్మ" అనే సంగీత వైద్య కళాశాల గురించి పేపర్లో చదివి ఆ పిల్లను అక్కడికి తీసుకు వచ్చాడు.

అందమైన లోయల్లో, చుట్టూ కొండల మధ్య, ప్రకృతి తల్లి ఒడిలో చాలా గొప్పగా కట్టాడు దక్ష ణామూర్తి ఆ ఇన్‌స్టిట్యూట్.

"ఫీజంటూ ఏం లేదు ... మీ ఇష్టం..." అన్నాడని చాలా గొప్ప డొనేషన్ చెక్కు రాసిచ్చాడు మేనమామ. ఆయన గుండెల్లో వుండే ఏదో గిల్టీ కాన్షియన్స్ తప్పిపోయినట్లయింది. సెలవు తీసుకు వెళ్ళిపోయాడు.

"రాధికను ఏడవ నెంబరు కాటేజీలో వుంచు రాజీవ్!" ఆలోచిస్తూ చెప్పాడు దక్షణామూర్తి.

xx xx xx

నిశ్శబ్దపు ఆత్మార్ణవలో నుంచి వెలుతురు కిరణం విరిగిన కెరటం మీద పడి చెల్లా చెదరై నేను ఒక్కటే అన్న భావానికి విరుద్ధంగా 'బహుఃదా' అన్న భావన వ్యక్తమైనప్పుడు దానికి కొంత "నేను, నా అంతటి వ్యక్తి" అన్నవి కలపోతలైనప్పుడు సమ స్యలు ప్రారంభమౌతాయి.

రాజీవి పరిస్థితి అదే...

దక్షణామూర్తి మహాగాయకుడు. అతడి శిష్యు రాలు ఆమె.

"మనోధర్మ"కు ఎందరో పేషెంట్సుగా, విద్యా ర్థులుగా వస్తూ వుంటారు. అటువంటి విద్యార్థిని ఆమె. కానీ ఆమె ఒక్కర్తే విద్యార్థిని కాదు.

సంగీతపు రాగచ్ఛాయల్లా దేశమంతటా ఆయన లయలో ఐక్యమైపోయే కొన్ని వందల ఎదలున్నాయి. ఆ ఎద లయల్లో నిదిరించే సంగీతామృతాలు ఎన్నెన్నో.

ఎవరికీ అందని శబ్ద మాధుర్యం అతని స్వరంలో

దిలీపుడి గురించి చెపుతూ కాళిదాసు

" శాస్త్రేషు అకుంఠిత బుద్ధిర్మౌర్వీ ధనుషిచా తతా అన్నాడు.

అందుకే అతని సంగీతం లేఖలకు, కొలతలకు ఇమడక ఒకొక్కసారి శాస్త్రీయత ఎల్లలు చెరిపే స్తుంది.

ఆ ఝరిలో కొట్టుకుపోయే కన్నె పారిజాతాలు ఎన్నెన్నో! మొదట్లో రాజీవి చాలా నిశ్శబ్దంగా వంచిన తల ఎత్తకుండా సంగీతం వింటోందా? నేర్చు కుంటోందా? ఆనందిస్తోందా అని ప్రశ్నించేటట్లు వుండేది.

సన్నటి అతని పెదవులు రాగాలాపనకు గురి అవుతూంటే ఆమె స్పందించేది ... చల్లబడిన అరిచేతులు ముడిచేసుకునేది. ఆమె ఆరాధనకు ఓపిక వున్నది. కానీ "స్పర్ధ" భరించలేదన్న విషయం ఆమెకే తెలియదు రాధికను చూసే దాకా...

సంగీతం నేర్చుకోవడానికి నానా బాధలు పడ్డ దక్షణామూర్తికి దాని విలువ సంపూర్ణంగా తెలుసు.

సరస్వతీ ఆశీర్వచనం స్వయంగా అందిస్తున్న ట్లుంటుంది అతణ్ణి చూస్తే.

"అవును. ఆమె నాలో, నా ఎదలో, నా గళంలో నర్తిస్తుంది. లేకపోతే నా కెక్కడిదీ పరిజ్ఞానం? ఏ స్కూల్లో చెపుతారట ఇవన్నీ?" అనే వినయ సంపన్నుడాయన.

అవార్డులు, సత్కారాలు కన్నా సాధనలో అను భవం,ఆర్తి అతడిని గొప్ప ఆనందంలో ముంచు తుంది.

ఆ తపనతోనే సంగీతం వైద్య శాస్త్రంగా మల చాలన్న తపస్సు ప్రారంభించాడతను.

అతని శిష్యులు, శిష్యురాళ్ళు అతని ప్రతి ఆలా పనకు, అనుకరణంగా నిలిచేవారు.


కళ అలౌకికమైదే.

కానీ ... ప్రపంచం చాలా లౌక్యమైనది.

ఆ విషయం కూడా తెలసినవాడతను... అందుకే ఆప్యాయత, ఆర్తి అర్థమయినా తన శిష్యులు తనకు తెలిసినా తెలియనట్లు నటించే వాడు. ముఖ్యంగా శిష్యురాళ్ళతో...

కానీ, గంభీరత ఎక్కడుంటే ఆడదాని హృదయం అక్కడ ఆవనీతమౌతుంది.

కుతూహలం మరింత అభిమానాన్ని పెంచు



తుంది. లొంగనితనం మరింత మొండితనాన్ని ఇస్తుంది.

సరిగ్గా రాజీవి విషయంలో ఇదే జరిగింది. హాయిగా, కష్టాలుతెలియని స్థితిలో వున్న ఆపిల్ల ఉబుసుపోక, ఏదో కొత్తరకంగా వుందన్న కుతూహలం కొద్దీ "మనోధర్మ"లో చేరింది.

పోగాడురి కన్నా, వాదనా ఝరి ఎక్కువైంది. ఆమెలో రానురాను. ఉబుసుపోక సంగీతం ప్రారంభించిన ఆమెకు సంగీత సాధనకన్నా సాధకుడైన [illegible] ప్రాణమైపోయాడు.

దక్షిణామూర్తి సంగీతాన్ని సైకిక్ సైన్సుగా చెబుతూంటే అవాక్కయిపోయి వినేది. ఆమె ప్రపంచం అంతా అతనే. అంత వరకూ బావుంది. కానీ, అతనికి తనే ప్రపంచం కావాలనుకోవడంతో సమస్య సలపరింతగా మారింది.

"పెళ్ళయి పిల్లలు వున్నవాడు. ఏమిటి నీ పిచ్చి? పైగా ఆలా బయట పడిపోతావేమిటి?" స్నేహితురాలు కేకలు వేసింది.

"పెళ్ళి వగైరాలతో ముడి పడే స్నేహం కాదిది" అని జవాబు చెప్పాలనిపించింది. అతడి కోసరం ఏ పని చెప్పినా చేసింది. గంటల కొద్దీ సంగీత సాధన చేసింది అతని మెప్పుకోసరం.

అతణ్ణి ఆలా చూస్తూ, ఆనందిస్తూ, సంగీతం వింటూ ఆలా కాలం గడుపుతున్న ఆమె భ్రమలోకి రాధిక నిజంలా వచ్చింది.

పైగా పేషెంటుగా వచ్చింది.

ఆమెను దగ్గరకు తీసుకుని ఒక ఎక్స్‌పరిమెంటులా చూడడం ప్రారంభించాడు దక్షిణామూర్తి.

ఆమె జీవితంలో లేనిదేమిటో అతి త్వరలో గ్రహించుకున్నాడు.

నిజమైన స్వచ్ఛమైన ప్రేమ.

ఆమెలో లేని దేమిటో కూడా అర్థమైంది "నమ్మకం ... పాజిటివ్ ఏటిట్యూడు..."


"ఆ పిల్లేమిటి మాష్టారూ... ఎవ్వరితోనూ కల వదు..." విసుక్కుంటూ అన్నది మొదట్లో రాజీవి.

"చాలా కష్టమైన కేసు... చూద్దాం..." అన్నాడు దక్షిణామూర్తి. తను చెయ్యవలసిన ప్రయత్నం ఎంత ఎక్కువో అతనికి తెలుసు.

నరాల్లో ఝరి, చర్మం శరీరం మీద నుంచి లాగి విస్తరింపచేసినప్పుడు కలిగే గిల్లినట్టున్న నెప్పి, అదే ఫ్రీక్వెన్సీలో తీగల వాయిద్యం మీటితే కలిగే రాగప్రస్తారపు ఎఫెక్ట్... ఇవన్నీ ఎక్స్‌పరిమెంటుగా చెబుతున్నాడు అతను.

ఆయన కాలాన్ని బట్టి, పేషెంటు స్థితిని బట్టి చేసే రాగాలాపనతో పాటు ఆలపిస్తుంది చుట్టూ ప్రకృతి, ఆయన శిష్యగణం.

రంగు, రాగం మనిషి "సైకో" మీద ఎక్కువ పనిచేస్తుందని తెలిసే అతను ఆ ఆకుపచ్చటి




బా (0) బు

'నీ పేరు బాబు అయితే అందరూ నిన్ను బాంబు అని పిలుస్తారేమిట్రా?'

'మేము దీపావళి బాంబులు తయారుచేస్తాంలే, అందుకే మా ఫ్రెండ్సంతా ముద్దుగా బాబు మధ్యలో 'సున్నా' చేర్చి 'బాంబు' అని పిలుస్తారు!'

—శర్మ సి.హెచ్.


వాతావరణం సృష్టించాడు. ఆకుపచ్చ, లేత నీలం, వెన్నెలలాంటి తెలుపు ఈ రంగులషేడుల్లోనించి తొంగిచూసే సూర్యకాంతి దానితో ఆయన రోగ స్థితిని బట్టి ఇచ్చే రాగ ప్రకంపన ఇవి రెండూ కలిసి ఒద్దనుకుంటున్నా ట్రాన్సులిటీకి లోనైపోతాడు మనిషి.

ప్రేమలో ఓడిపోవడం, డబ్బుతో సర్వం కొనె య్యగలమనుకున్న మనుష్యుల మధ్య బ్రతకడం, నిసిజమ్ – ఇవన్నీ ఇప్పుడు ఏదో లోకపు ఆధార భావాల్లా, ఊహల్లో చెరిగిపోయిన గీతల్లా ఉన్నాయి రాధికకు.

ప్రకృతి, కళలు, జ్ఞానం – ఇవన్నీ అలౌకిక సంపదలు – అంతులేనివి – అన్న విషయం గురించి కనీసం ఆలోచించాలన్న జ్ఞానం కలుగుతోంది ఆ అగర్భ శ్రీమంతురాలికి.

ఆమెలో విస్తరిస్తున్న అనుభవ జ్ఞానం ఆమె నరాల మీద పనిచేసి ఆమే ఒక ఔషధిలా తయారౌతోంది.

రియాక్షన్ ఒద్దు... యాక్షన్ కావాలి మనకు... మనమేదో గ్రహంలో దాక్కున్న ఆలోచనల కొసలు




పట్టుకోవాలి... మనలో దాక్కున్న ప్రత్యేకత, గొప్పతనం, ఆలోచనలు, ఆదర్శాలు, కోరికలు, భయాలు తెలుసుకోవాలి. మరింత లోలోపలికి వెళ్లి మనలను మనం పలకరించుకుంటే మన చుట్టుపక్కల జీవన క్రమంలో, లయలో కలిసిపోతాము... అప్పుడు ఒంటరితనం పరాయితనం పోతాయి..." చెబుతున్నాడు దక్షిణామూర్తి.

"స్విస్ సైకాలజిస్ట్ జంగ్ దీన్నే 'కలెక్టివ్ కాన్షియస్నెస్' అన్నాడనుకుంటాను..."

అంతమంది విద్యార్థుల మధ్య సన్నటి కంఠస్వరం.

ఆమె రాధిక... నవ్వుతూ తలెత్తి చూశాడు దక్షిణామూర్తి. అతని నవ్వులో ఏదో తెలిసినతనం వున్నది.

అది చూసి ఉలిక్కిపడింది రాజీవి.

దక్షిణామూర్తి ప్రతి పరిశోధనకు అద్భుతంగా స్పందించి మారిపోతోంది రాధిక.

భరించలేక బాధ పడిపోతోంది రాజీవి.

"మాష్టారూ! ఆ పిల్లకు పిచ్చా?! అలా రియాక్ట్ అయిపోతుంది అన్నింటికీ..." దక్షిణామూర్తి కొన్ని ఒకాల వైబ్రేషన్స్ ఆ రాధిక మీద ఎక్స్‌పరిమెంటు చేస్తే జలజల కన్నీరు కారుస్తూ, వుక్కిలింతల దుఃఖంలోకి వెళ్లిపోతున్న రాధిక దుఃఖం కాదు నిజానికి రాజీవిని బాధ పెట్టేది... దక్షిణామూర్తి ఆమెను దగ్గరకు తీసుకుని కన్నీరు తుడవడంతో వచ్చింది బాధ.

"సంతోషించవలసిన విషయం కదూ... చంద్రకాంతశిల లాంటి ఆ పిల్ల కరుగుతోంది..." అన్నాడతను.

ఎలా చెబుతుంది రాజీవి' మీ దగ్గరతనం భరించలేనని?!

ఆయనకు విద్య నేర్పుకుంటున్న పిల్లలే అసిస్టెంట్సు. అహం లేనివాళ్లకు డిగ్నిటీ ఆఫ్ లేబర్ తెలిసిన వాళ్లకు పరీక్ష పెట్టి గొప్పగా ట్రైనింగ్ ఇచ్చేవాడు.

"ముందు మనం చాలా ఎదగాలి... అప్పుడే ఏ విద్యన్నా పట్టుబడుతుంది. ఆ తరవాత కళగా లొంగుతుంది. అలాకాక, నేను గొప్ప, ఇది మనిషిని అన్న భావన వుంటే రాగాలన్నీ మూగవోతాయి... అటువంటి వాళ్లకు గంగానది పక్కనున్నా, దాహం తీరదు–"

అతని మాటలు విని ఆలోచిస్తోంది రాధిక. అక్కడే గొప్ప లైబ్రరీ వుంది. పుస్తకాలు చదువుతోంది. ఎలక్ట్రానిక్ ఇన్స్ట్రుమెంటు మీద ఎక్స్‌పరిమెంటు వినయంగా, మెలుకువగా చూస్తోంది. వునరుచ్చరణ, లయ, శ్రుతి పక్వం, స్థాయి, రంగు, రూపం, వీటన్నింటినీ మించి సంగీతకారుడి మన స్తత్వం. అది పరిపక్వం పొందకపోతే అందమైన ఆలాపన మిగులుతుంది కానీ, అది వైద్యకళగా

మారదు. రససిద్ధి ఔషధ సిద్ధి కావాలి" ఇదుగో ఇటు చూడండి... ఒకే శృతి మీద ఆపకుండా ఉచ్ఛ స్వరాలాపన. దీన్ని డ్రోన్(DRONE) అంటారు... ఇది చెయ్యి ఎముక మీద, వీపు కింద భాగం మీద పని చేస్తుంది ..


దీని వాయిద్యం?

మన తాన్‌పూరా, పాశ్చాత్యుల సెల్లో, సిన్థసైజర్... ఇవి స్వరపేటికకు పక్షవాతం వచ్చినప్పుడు కూడా గొప్పగా పనిచేస్తాయి...

అలాగే రిపిటీషన్, హార్మోనిక్స్, రిథమ్, హార్మనీ, మెలడీ, ఇన్‌స్ట్రుమెంటల్ కలర్, ఫాం... చాలా నేర్చుకుంటోంది రాధిక.

రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేస్తోంది.

మేథమాటికల్ మ్యూజికాలజీలో సంధి, రంగు, బీజం– మన వివిధ శరీర భాగాలకు సంబంధం ఎలా వుంటుందో, జగదీశ్ చంద్రబోస్ ప్లాంటు సైకాలజీ, వియన్నాలో హార్మోన్స్ మీద రిసర్చ్, మన శాస్త్రీయ సంగీతంతో అనుబంధంగా మారిన పైథాగరస్ కనిపెట్టిన మ్యూజిక్ ఆఫ్ స్ఫియర్స్ (Music of Spheares) – ఇవన్నీ చెబుతున్నాడు దక్షిణామూర్తి. తీగ, స్పందనకు సంబంధించిన సంగీత సాధనాలు శరీరం పైభాగాన పనిచేస్తాయి... డ్రమ్, డోలక్, బేస్ గిటార్ లాంటివి శరీరపు కింద భాగం మీద పని చేస్తాయి.




గ్యాస్

"గ్యాస్ అయిపోయింది మహాప్రభో అని ఎంత మొత్తుకున్నా మీకు చీమ కుట్టినట్టు లేదేమిటండి" అని విసుక్కుంది భార్యామణి.

"చుట్టుప్రక్కల వాళ్ళకు గ్యాస్ కబుర్లు చెప్పడం ఆపి, గ్యాస్‌బండకు చెప్త, బండన్నా నిండుతుంది" అన్నాడు భర్త– ప్రవాహంలాసాగే తన భార్య ఊసుబోని కబుర్లను తలచుకుంటూ.

–పి.సీతారామయ్య

చాలా గ్రహిస్తోంది రాధిక... నరాలలో చచ్చుదనం, ముఖంలో ముడుపు పోయింది. చలాకీగా వున్నది.

"సంగీతపు శక్తి చాలా చాలా గొప్పది. అర్థమవ్వాలి... అది ఉపయోగించడంలో జాగ్రత్త లేకపోతే అంతర్గతమైన మృగతృష్ణలను నిద్రలేపి, మనిషిని కంట్రోలు తప్పిస్తుంది..." హెవీ మెటల్, రాక్ మ్యూజిక్‌ల ఎఫెక్ట్ చెపుతున్నాడు దక్షిణామూర్తి.

మెలోడీ, రిథమ్... ఇవి కలిసిన అద్భుత సంగీతాలాపనలో ట్రాన్స్‌లోకి వెళ్లిపోతాం... మన "సెల్ఫ్" అప్పుడు నిద్రలేచి, రకరకాల రంగుల్ని, రూపాల్ని ఊహించి, మనకు చూపించి, మనకు మనమే దైవత్వం, గొప్పతనం ఆపాదించుకునే ఒక రకం స్కిజ్రోజియో ఫినిక్స్ గురించి చెప్పాడు. గొప్పగా వుండే భజనలు సంగీతాలూ జాతరలు – ఒక లెవల్ దాటితే స్వ కపోల కల్పనలకు దారితీయడానికి అర్థం తెలిసింది రాధికకు.

"ఎలా నేర్చుకోవాలో చెప్పారు మాష్టారూ... ఎంత నేర్చుకోవాలో, ఎక్కడ ఆపాలో ఎలా తెలుస్తుంది? మాష్టారూ! అసలు గొప్ప సంగీతాన్ని ఎలా తెలుసుకుని ఋజువు చెయ్యడం?!" అడిగింది రాధిక.

"ఆలావేవ్స్ తెలియచెప్పే యంత్రం చూశావుగా... ఆ ఫ్రీక్వెన్సీ నీలో బాలన్స్‌లో వున్నప్పుడు నువ్వు అద్భుతమైన ప్రశాంతతకు లోనౌతావు... ఆ స్థితిలో నిన్ను వుంచేది గొప్ప సంగీతం..."

కచ్చగా వుంది రాజీవికి రాధికా స్వాంతనానికి... మాష్టారు, రాధిక ఎంత దగ్గరౌతున్నారన్న విషయం మీద వుండే శ్రద్ధ, చదువు, ఎదుగుదల మీద లేదు ఆమెకు.

మాష్టారికి వినబడేటట్లు అర్థరాత్రి హెవీ మెటల్ మ్యూజిక్ పెట్టింది.

ఒక్కసారి వాతావరణం కల్లోలమైపోయింది. తలుపు తట్టి "రాజీవీ!" అని ఒక్క అరుపు అరిచాడు దక్షిణామూర్తి.



ఏడ్చి, కళ్లు ఉబ్బిపోయి, ఆత్మ పదిసార్లు హత్య చేసుకున్న ఆడదానిలా వున్నది ఆ పిల్ల.

ఆ కళ్లల్లో నిర్లక్ష్యం... ఇప్పటికైనా నా ఉనికిని గుర్తించావుగా! అన్నదొక్కటే ఆ పిల్ల ఆలోచన.

వర్షంలో తడిసిన పచ్చటి కొండలు, జాబిల్లి జిలుగుతో మెరుస్తున్న ఆకులు... నిద్రపోతున్న పూల పాపాయిలు, ఎక్కడి నుంచో వస్తున్న వీణానాదం...

అదొక అలౌకిక ప్రపంచం...

కానీ రాజీవి దృష్టిలో అదంతా భ్రమ.

నిజం... ఆమెకు తెలిసిన నిజం... అంత అర్ధరాత్రి మాష్టారూ, ఆయన వెనక రాధిక... ఆ వెనక మరికొంతమంది వున్నారు. కానీ, వాళ్లు ఆమె లెక్కల్లోకి రారు.

"రాజీవీ! నీకిక్కడ వుండాలని లేదా?" చాలా స్థిరంగా అడిగాడు అతను.

"మాష్టారూ!" గబగబా కాటేజీ మెట్లు దిగి వచ్చేసింది. "అది కాదు..." ఏవేవో మాటలు కొట్టిపోస్తోంది... కళ్లల్లో నీళ్లు...

"ఇదంతా ఒద్దు! నేను రాగాలతో రోగాల మీద ఎక్స్‌పరిమెంటు చేస్తున్నాను. నీలాంటి స్టూడెంటు పేషెంటు అయ్యే పరిస్థితి వస్తే, నేనూ నా 'మనోధర్మ' వృథా! ఆలోచించుకో... ఆ స్థితి రానియ్యకు..."

ఒక్కసారి నాగినిలా అహం ఆమెలో పడగెత్తింది. "దానికి కారణం సంగీతం, ఎక్స్‌పరిమెంటు, 'మనోధర్మ' కారణం కాదు మాష్టారూ! మీ డిస్క్రిమినేషన్ కారణం. మీ పక్షపాత ధోరణి కారణం... తప్పించుకోకండి... మీరు రాధిక మీద చూపించే జాలీ, సానుభూతీ, శ్రద్ధ ఇవన్నీ రోగాలకు, రాగాలకు అతీతం మాష్టారూ! మెటల్ మ్యూజిక్ ఎలా నరాల మీద పనిచేస్తుందో రీడింగ్స్ తీసిపెట్టమన్నారు మీరు... అదే చేస్తున్నాను నేను... తప్పా!"

ఆ గొంతులో మొండితనం, కనుబొమలు ఎగరేసి ఛాలెంజ్ చేస్తున్న కళ్లు, వణుకుతున్న పెదవులు, ఏ మనిషి ప్రేమకై తపించి ఇంత అల్లరి పెడుతోందో, ఆ మనిషి గౌరవం, పరువు తన అహం అడ్డం వచ్చేటప్పటికి బలిపెడుతోంది.

నవ్వొచ్చింది దక్షిణామూర్తికి. మనిషి, దేవత, మృగం వీటన్నింటికీ మంత్రోచ్చాటన, స్వరకల్పన తెలిసినవాడు నవ్వక రియాక్ట్ ఎలా అవుతాడు?

"దానికి రీడింగే అక్కర్లేదు... ఎఫెక్ట్ కనబడుతోంది..," అన్నాడు.

"మీరేగా మాష్టారు 'కండిషన్ అవకండి, ఓపెన్‌గా వుండండి, సెన్సిటివ్‌గా ప్రతి అనుభవాన్ని గ్రహించుకునే స్థితిలో వుండండి..' అంటారు..." అని తెలివిగా మాట్లాడుతున్నాననుకుంటోంది రాజీవి.

"రూల్సుకు లోబడటం ఎంత సెన్సిటివ్‌నెస్‌ను




చిత్రం: ఇ.గోపాలరావు

చంపుతుందో, విశృంఖలత అంతకన్నా ఎక్కువగా చంపుతుంది రాజీవీ... ఆల్కహాల్‌తో రియాక్షన్స్ అబ్జర్వ్ చెయ్యడానికి తాగుబోతైపోకూడదు... నీ అర్ధరాత్రి ఎక్స్‌పరిమెంట్లు అందర్నీ డిస్టర్బ్ చెయ్యకూడదు. నిద్రపో... అల్లరిచెయ్యకు..." తల మీద చెయ్యి వేసి నిమిరి వెళ్లిపోయాడు అతను.

ఉక్రోషంతో రాత్రంతా రాజీవి అతను వెళ్లినదారినే చూస్తూ ఏడుస్తూనే వున్నది... సాధన కన్నా ఉద్రేకం ఎక్కువైంది ఆమెలో.

***

"మాష్టారూ రాయిలాంటి నన్ను రాగం పాడే వాయిద్యంలా మలిచారు. 'నీకు లేనివాటిని గురించి ఆలోచించుకుని జీవితం శూన్యం చేసుకోకు. వున్న అవకాశాలు ఉపయోగించుకో...' అని మీరు అన్నప్పుడు నాకు మొదట్లో అర్థంకాలేదు. కానీ ఇప్పుడు, నా డబ్బు, నా పరిస్థితి, నా రిసర్చ్‌కు ఉపయోగిస్తాయి. నా జీవితానికి ఒక అర్థం తెలుస్తోంది. జీవితం నాకు ఇచ్చిన సదవకాశాలు మీలాంటి గురువు – థాంక్యూ మాష్టారూ! నేను విదేశాల నుంచి తిరిగి వస్తాను. మరింత నేర్చుకుని సాధించి వస్తాను. మన స్కూలు మరింత గొప్పగా తయారుచేద్దాం..."

సితార్ వాయిద్యం వరి పొలాల మీద ఇచ్చిన ఎఫెక్ట్ మీద థియరీ సబ్మిట్ చేసింది రాధిక రెండేళ్లలో... స్కాలర్‌షిప్ మీద విదేశాలకు వెళుతోంది.

బెథోవెన్ మ్యూజిక్ స్ఫియర్స్‌లో నలభై ఇంతలు పెరిగి ఆరోగ్యంగా తయారౌతున్న జంతువుల మీద ఎక్స్‌పరిమెంటుకు ఆమెను పిలిచారు అక్కడి ప్రొఫెసర్... ఆమెతో మరిద్దరు "మనోధర్మ" స్టూడెంట్సు సెలక్ట్ అయ్యారు.

ఆనాడు తన దగ్గరకు వచ్చిన బేల పిల్ల, సంఘంలో అర్థంకాని నైతిక విలువలతో పోట్లాడి, అలసిపోయి, డిప్రెషన్‌కు లోనై బాధపడ్డ రోగిష్టి పిల్ల, గొప్ప స్థితికి చేరుతోంది.

దక్షిణామూర్తికి పాదాభివందనం చేసి కారెక్కింది రాధిక. ఆమె వెళ్లిపోతున్న ఆకుపచ్చటి దారుల వంక చేతులు కట్టుకుని చూస్తూ నిలబడ్డాడు దక్షిణా మూర్తి. ఒక రకమైన తృప్తి... అంతలో ఏదో నిబద్ధతకు, కొల బద్దలకు అందని ఏదో బాధ. ఈ రెండూ సమానాంతర రేఖల లాంటి భావాల మధ్య అతనిలోని అణువు, అణువు జాగృతమై మరింత పదునెక్కుతోంది. అదొక మూర్ఛన... ఒక వింత అనుభూతి, ఒక గొప్ప ఇన్‌స్పిరేషన్... అతని హృదయం నిశ్శబ్దంగా మనోధర్మ రాగాన్ని ఆలాపన చేస్తోంది.

గిర్రున వెనక్కు తిరిగాడు ఏదో రూపుదాల్చని గొప్ప ఆలోచనా భావంతో.

"బాధగా ఉందా మాష్టారూ! రాధిక వెళ్లిపోయిందని?!" చేతులు కట్టుకుని అతణ్ణే చూస్తోంది రాజీవి.

ఆ గొంతులో వెటకారం, అసూయ, బాధ, అర్థం చెప్పలేని ఎన్ని భావాలో?! మనిషి సృష్టించిన ఏ వాయిద్యం పలికించగలదు అన్ని అద్భుతాల్ని?!

నవ్వొచ్చింది అతనికి.

"అహా ఏంలేదు... ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని డిపార్ట్‌మెంటుల్లో రిసర్చ్ జరిగినా మనిషిలో అహం, అసూయ – ఈ రెండూ కంట్రోల్ చెయ్యగల మిషన్ ఏదా?! అని... రా వెళదాం..."

తన బాట వైపు అడుగులు వేస్తూ అన్నాడు దక్షిణామూర్తి.

■

### కిటుకు

"వాహనములు నిలపరాదు" అని వున్న బోర్డుకు ప్రక్కగా తన మారుతీ కారుని నిలిపింది ఒక ఆధునిక మహిళ. షాపింగ్ ముగించుకొని తన కారు దగ్గరకు వచ్చిన ఆమె కారు డ్రైవింగ్ సీట్లో కూర్చుని వున్న రొయ్యమీసాల కానిస్టేబుల్‌ని చూసి గతుక్కుమంది.

ఆటోలో ఇంటికి వెళ్ళిపోయి ఫోన్ చేసిందిలా.

"హలో పోలీస్ స్టేషన్ ఎ.పి. 10బి 1743 నెంబరు గల నా మారుతి కారుని గంట క్రితం ఎవరో దొంగిలించారు"

పదిహేను నిమిషాల్లో తన మారుతి కారుని క్షేమంగా ఇంటికి చేర్చాడు మీసాల ట్రాఫిక్ కానిస్టేబుల్.

—కె.వి.ఆర్. అక్కయ్య